
సాక్షి
వరంగల్

సోమవారం । 17 । జూన్ । 2024



బ్యాగు..భద్రత ముఖ్యం
పుస్తకం నుంచి మొదలు పెన్ను, పెన్సిల్, టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్ తదితర వస్తువులను భద్రపరిచే బ్యాగుల కొనుగోలుతో షాపుల్లో సందడి నెలకొంది. - 8లో



రేషన్ బియ్యం పట్టివేత
అక్రమంగా లారీలో మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 17 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు, టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36^{0} /27^{0}

వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు 'విద్యుత్' ప్రజావాణి

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు టీజీ ఎన్పీడీసీఎల్‌లో ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ, వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటిని సకాలంలో పరిష్కరించనున్నట్లు ఒక ప్రకటనలో వివరించారు. ఎన్పీడీసీఎల్ పరిధి అన్ని సర్కిళ్లలోని డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సర్కిల్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెక్కొండ మార్కెట్ చైర్మన్‌గా హరీశ్‌రెడ్డి



నెక్కొండ: నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన రావుల హరీశ్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా గూడూరు మండలానికి చెందిన ఎడ్ల నరేశ్‌రెడ్డి, కమిటీ డైరెక్టర్లుగా కునుసోతు నైజాం నాయక్, జమ్ముల సోమయ్య, కొత్తపల్లి రత్నం, దూదిమెట్ల కొమురయ్య, మహ్మద్ ఖలీల్, మామిడ్ల మల్లయ్య, రావుల మహిపాల్‌రెడ్డి, బొమ్మెరబోయిన రమేష్, సమ్మెట శ్రీనివాస్, కందిక సుమలత, దొడ్డ విజయ్, తాళ్లూరి నర్సింహాస్వామి నియమితులయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ముగిసిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు

హన్మకొండ: యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన ఈ పరీక్షకు 55.75 శాతం, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 55.26 శాతం అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 4,730 మంది అభ్యర్థులకుగాను ఉదయం జరిగిన పరీక్షకు 2,637 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 2,614 మంది అభ్యర్థులు హాజరయ్యారు. యూపీఎస్సీ సెంట్రల్ అబ్జర్వర్ హరిహర్ రాథ్, టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పెషల్ అబ్జర్వర్‌తో కలిసి ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తున్న యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, శ్రీ గాయత్రి డిగ్రీ కాలేజీ అండ్ పీజీ కాలేజీ, సీడీసీ డీమ్డ్ యూనివర్సిటీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పింగిళి ప్రభుత్వ జూనియర్ కళాశాల వడ్డేపల్లి, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కాలేజీ, న్యూ సైన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశా ల, ఎస్ఆర్ నేషనల్ హై స్కూల్, మాస్టర్ జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశా రు. పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులకు కల్పించిన వసతులపై అధికారులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

మేడారంలో భక్తుల కోలాహలం



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం వేలాదిగా తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద షవర్ కింద స్నానాలు ఆచరించారు.

గద్దెల ప్రాంగణంలో సందడి

స్నానాల అనంతరం భక్తులు అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర, సారె, కానుకలు, ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీతో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం సందడిగా కనిపించింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మేడారానికి భక్తుల తాకిడి తగ్గలేదు. సుమారుగా 20వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు దేవాదాయశాఖ అధికారులు అంచనా వేశారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది గద్దెల ప్రాంగణంలో దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

అడవిలో వంటావార్పు..

భారీగా తరలివచ్చిన భక్తులు మేడారం సమీప అటవీ ప్రాంతంలో వాటావార్పు చేసుకోవడంతో ఆర్టీసీ బస్టాండ్, శివరాంసాగర్ చెరువు, చిలకలగుట్ట పరిసర ప్రాంతాలు భక్తులతో సందడిగా కనిపించాయి. కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనలు చేశారు. పలువురు డీజే సౌండ్స్‌తో డ్యాన్స్‌లు చేసి సందడి చేశారు. దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ జగదీశ్వర్ భక్తులకు అందుబాటులో ఉండి సేవలదించారు.

ఇక ఐపీఎస్‌ల వంతు..!

- ఒకేసారి ఐదుగురు ఐఏఎస్‌ల బదిలీ
- అదే తరహాలో పోలీసుశాఖలో ట్రాన్స్‌ఫర్లు..
- పోస్టింగ్‌ల కోసం ఎవరికి వారుగా ప్రయత్నాలు
- రెండు, మూడు రోజుల్లో రెవెన్యూ, పోలీసుశాఖల్లో బదిలీలు
- స్థానిక సంస్థల ఎన్నికల నాటికి 'పాలన' చేతికి వచ్చేలా..



సాక్షిప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్‌లో ఐఏఎస్‌ల బదిలీలు దాదాపు పూర్తయినట్లే. తదుపరి వంతు ఐపీఎస్ అధికారులదేనన్న ప్రచారం జోరందుకుంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే లోక్‌సభ ఎన్నికలు, ఎలక్షన్ కోడ్ రావడంతో ప్రభుత్వం బదిలీలపై దృష్టి పెట్టలేదు. ఈనెల 6న ఎన్నికల కోడ్ ముగియగా.. కొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముంచుకొస్తున్నది. ఈ నేపథ్యంలో.. పాలనపై తమ మార్కు వేసేందుకు.. ఐఏఎస్‌లతో బదిలీలకు తెర తీసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మొదటిసారిగా శనివారం పెద్ద సంఖ్యలో కలెక్టర్(ఐఏఎస్)లను బదిలీ చేసింది. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్‌లోని నాలుగు జిల్లాల్లో ఐఏఎస్ అధికారులకు స్థానచలనం కలిగింది. ఇదే సమయంలో ఐపీఎస్‌ల బదిలీలు కూడా తప్పవన్న ప్రచారం సాగుతుండగా.. వరంగల్ సీపీ సహా పలువురికి ట్రాన్స్‌ఫర్లు ఉంటాయన్న చర్చ జరుగుతోంది. ఆతర్వాతే రెవెన్యూ, పోలీసుశాఖల్లో అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరిగే అవకాశం ఉందంటున్నారు.

ఐపీఎస్‌ల బదిలీలపై ఉత్కంఠ..

ఊహించని విధంగా పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం కలిగిన నేపథ్యంలో.. ఐపీఎస్ అధికారుల్లోనూ బదిలీల చర్చ జరుగుతోంది. పోలీస్ కమిషనర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసులతో పాటు ఇతర కేడర్లలో ఉన్న పలువురు ఐపీఎస్‌లకు బదిలీలు తప్పక పోవచ్చంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి వరంగల్ సీపీగా ఉన్న ఏవీ రంగనాథ్‌పై 'కోడ్'లో భాగంగా ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. ఈక్రమంలో 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అంబర్ కిషోర్ ఝాను 2023 అక్టోబర్ 13 వరంగల్ కమిషనర్‌గా నియమించారు. 2012లో ఉమ్మడి వరంగల్ ఓఎస్డీగా, అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించిన అంబర్ కిషోర్.. ఎస్పీగా పదోన్నతి పొంది 2014లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేశారు. 2023లో మరోసారి సీపీగా నియమితులైన ఆయన కూడా బదిలీ అవుతారన్న చర్చ జరుగుతోంది. ఆయన స్థానంలో సీపీగా వచ్చేందుకు ఏవీ రంగనాథ్, ప్రకాశ్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అంబర్ కిషోర్ ఝా రెండు రోజుల క్రితం సెలవులో వెళ్లగా.. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఇన్‌చార్జ్ సీపీగా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా ములుగు ఎస్పీగా ఉన్న గౌస్ ఆలం ఆదిలాబాద్ ఎస్పీగా బదిలీ కాగా.. ఆయన స్థానంలో 2017 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ శబరీష్‌ను ఈ ఏడాది జనవరి 4న నియమించారు. మహబూబాబాద్ ఎస్పీగా ఉన్న శరత్‌చంద్ర పవార్ 2023 ఆగస్టు 29న బదిలీ కాగా.. ఆయన స్థానంలో సుధీర్ రామ్‌నాథ్‌కు పోస్టింగ్ ఇచ్చారు. అయితే ప్రభుత్వం చేపడుతున్న మూకుమ్మడి బదిలీల్లో ఈ ఇద్దరు ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం ఉంటుందా? లేదా? అన్న చర్చ సాగుతోంది. అదే విధంగా వరంగల్ కమిషనరేట్‌లో డీసీపీగా ఉన్న పుల్ల కరుణాకర్‌ను 2023 జూలై 23న అప్పటి ప్రభుత్వం జేఎస్ భూపాలపల్లి ఎస్పీగా నియమించింది. ఎన్నికల సంఘం అభ్యంతరంతో 2023 అక్టోబర్ 13న ఆయనను బదిలీ చేసి కిరణ్ ఖరేను ఎస్పీగా నియమించింది. ఈసారి జరిగే బదిలీల్లో భూపాలపల్లి ఎస్పీగా అవకాశం కల్పించాలని కొందరు నాన్ క్యాడర్ ఎస్పీలు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ ఎస్పీల పనితీరు సంతృప్తికరంగానే ఉన్నా.. రాజకీయ సమీకరణల్లో భాగంగా ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా.. ఐఏఎస్ బదిలీలతో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం వీలైనంత తొందరగా ఐపీఎస్‌ల బదిలీలు పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఆ వెంటనే అదనపు కలెక్టర్, ఆర్డీఓ, డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ల బదిలీల తంతు ముగించే ప్రక్రియలో భాగంగా ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరిస్తున్నది.

కలెక్టర్ల బదిలీలతో కలకలం..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు 'కుడా' వైస్ చైర్‌పర్సన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఐఏఎస్‌ల బదిలీలకు శ్రీకారం జరిగింది. ఇదే సమయంలో హనుమకొండలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా ఉన్న రాధికాగుప్తా బదిలీ అవుతున్నారన్న ప్రచారం జరిగింది. మరుసటి రోజు శనివారం హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను నారాయణపేట్ కలెక్టర్‌గా బదిలీ చేసి ఆమె స్థానంలో వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్యను నియమించారు. వ్యవసాయ, సహకార శాఖ సంయుక్త కార్యదర్శి ఎం.సత్య శారదాదేవికి వరంగల్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. జేఎస్ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రాను బదిలీ చేసి.. ఆయన స్థానంలో వికారాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాహుల్‌శర్మను కలెక్టర్‌గా, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠిని బదిలీ చేసి ఆమె స్థానంలో జగిత్యాల అదనపు కలెక్టర్ దివాకర టీఎస్‌ను కలెక్టర్‌గా నియమించారు.

అయితే అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఓసారి బదిలీ అయిన కలెక్టర్లు.. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే మళ్లీ బదిలీ వేటుకు గురికావడం ఐఏఎస్ వర్గాల్లో కలకలం రేపింది. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేసిన పి.ప్రావీణ్య మొదట వరంగల్ కలెక్టర్‌గా, ఆ తర్వాత హనుమకొండ కలెక్టర్‌గా ఇక్కడిక్కడే బదిలీ కాగా.. ఉమ్మడి జిల్లాలో పని చేసిన సిక్తా పట్నాయక్ కొద్ది రోజులకే నారాయణపేటకు బదిలీ కావడం.. బదిలీ అయిన ములుగు, భూపాలపల్లి కలెక్టర్లకు పోస్టింగ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశం అవుతోంది.

కలెక్టర్‌గా సత్యశారదాదేవి బాధ్యతలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు, ఉద్యోగులు

- బాధ్యతలు స్వీకరించిన నూతన కలెక్టర్
- శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ సత్య శారదాదేవి ఆదివారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, వివిధశాఖల అధికారులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడి శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు అందేలా సమీక్షలు నిర్వహిస్తానని తెలిపారు. అధికారుల సమన్వయంతో అభివృద్ధిలో వరంగల్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీపీఆర్ఓ అయ్యూబ్ అలీ, డీఈఓ వాసంతి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఆర్డీఓలు సీతం దత్తు, కృష్ణవేణి, ఎల్‌డీఎం హవేలీ రాజు, కలెక్టరేట్ ఏఓలు శ్రీకాంత్, అబిద్ అలీ, తహసీల్దార్‌లు ఇక్బాల్, నాగేశ్వరరావు, ఫణికుమార్, విజయ్, రవిచంద్రారెడ్డి, పర్యవేక్షకులు మంజుల, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా.. కలెక్టర్ సత్య శారదాదేవిని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండ కలెక్టర్‌గా బదిలీ అయిన ప్రావీణ్య, వరంగల్ నూతన కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి మర్యాదపూర్వకంగా కలుసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బాధ్యతల స్వీకరణ

వరంగల్ జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ సత్య శారదదేవి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు కలెక్టరేట్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాఖల వారీగా అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు చేరేలా చూస్తామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీపీఆర్ఓ అయూబ్ అలీ, డీఈఓ డి.వాసంతి, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఆర్డీఓలు సీతం దత్తు, కృష్ణవేణి, ఎల్‌డీఎం హవేలీ రాజు, కలెక్టరేట్ ఏఓలు శ్రీకాంత్, అబీద్ అలీ, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, ఫణికుమార్, విజయ్, రవిచంద్రారెడ్డి, పర్యవేక్షకులు మంజుల, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి

భద్రకాళిని దర్శించుకున్న కలెక్టర్ సత్యశారదాదేవి

హన్మకొండ కల్చరల్ : వరంగల్ జిల్లా కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ సత్య శారదాదేవి ఆదివారం బాధ్యతలు స్వీకరించడానికి ముందు శ్రీభద్రకాళి దేవాలయాన్ని కుటుంబసమేతంగా సందర్శించారు. ఆమెకు ఈఓ శేషుభారతి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేసిన అనంతరం కలెక్టర్‌కు ప్రధానార్చకులు భద్రకాళి శేషు తీర్థప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

కోటను సందర్శించిన కలెక్టర్

ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటను ఆదివారం వరంగల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సత్యశారదాదేవి కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మధ్యకోటలోని రాతి, మట్టికోట అందాలు, గుండు చెరువు, ఖుష్‌మహల్, శృంగారపు బావి, నాలుగు తోరణాల్లోని నాటి శిల్పాలు నల్లరాతిలో చెక్కిన అద్భుతం శిల్పకళా సంపదను ఆసక్తిగా తిలకించారు. వారి వెంట తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, సిబ్బంది ఉన్నారు.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

- నీటి సరఫరా వివరాలు సేకరిస్తున్న సిబ్బంది
- ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నర్సింహమూర్తి

నర్సంపేట: గ్రామాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. కోట్లాది రూపాయలు వెచ్చించినా.. జిల్లాలోని 323గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ఆశించినమేర మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడంలేదు. కొన్ని చోట్ల పూర్తి కాని పైపులైన్ల నిర్మాణం, పైపులైన్ల లీకేజీలతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రతి ఇంటికి ప్రభుత్వ లక్ష్యం మేరకు నీటి సరఫరా చేయలేకపోతున్నారు. మరికొన్ని ఇళ్లల్లో ఇంకా నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వం సర్వేకు ఆదేశించంది. భగీరథ నీటిని ప్రతి ఇంటికి అందించే లక్ష్యంతో సర్వే చేపడుతున్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటిని సర్వే చేసి కుటుంబ సభ్యుల వివరాలు, నల్లా కనెక్షన్ వివరాలు, నీటి సరఫరాకు సంబంధించి ప్రజల అభిప్రాయాలను సిబ్బంది ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి గ్రామాల్లో సర్వే ప్రారంభమైంది. 2015లో అప్పటి ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసి ట్యాంక్‌లు, ప్రత్యేకంగా పైపులైన్లు, నిర్ణీత ప్రాంతాల్లో నీటి శుద్ధి కోసం ఫిల్టర్‌బెడ్లు నిర్మించింది. కొన్ని గ్రామాల్లో పాత ట్యాంకులకు నీలిరంగు వేసి మిషన్ భగీరథ ట్యాంకులుగా పేర్లు మార్చింది. జిల్లాలో 11 మండలాల్లో 1,20,045 ఇళ్లు ఉండగా, ఉచితంగా తాగు నీటి సరఫరాను ప్రారంభించింది. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ బోర్ మోటా ర్లు, మినీ ట్యాంకుల వినియోగం తగ్గించారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

ప్రస్తుత పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరా ఎలా ఉంది..? అనే అంశంపై ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శితోపాటు పంచాయతీల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పైప్‌లైన్లు పటిష్టంగా ఉన్నాయా? ట్యాంక్‌ల ద్వారా ప్రతి ఇంటికి నీరు అందుతుందా..? ఇంకా ఎన్ని ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సిన అవసరం ఉంది? తదితర అంశాలపై జీపీ సిబ్బంది వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

ఎంఈఓలు లేని విద్యాశాఖ..

- సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు
- ఒకరికి నాలుగు మండలాల కేటాయింపు



కాశీబుగ్గ సెంటర్: విద్యావ్యవస్థకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయి చర్యలకు పొంతనలేకుండాపోయింది. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యావ్యవస్థలో మార్పుదిశగా అడుగులు వేస్తున్నామని చెబుతున్నా.. కనీసం మండల విద్యాశాఖ అధికారులను నియమించలేని పరిస్థితి నెలకొంది. జిల్లాల పునర్విభజన తర్వాత నుంచి జిల్లాలో ఒక్కరు కూడా పూర్తి స్థాయి ఎంఈఓ లేకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 690పాఠశాలలు ఉండగా ఇందులో ప్రాథమిక పాఠశాలలు 478, ఉన్నత పాఠశాలలు 70, జెడ్పీహెచ్‌ఎస్‌లు 142 ఉన్నాయి. వీటితోపాటు గురుకుల పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు లేక మూతపడిన పాఠశాలలు 126ఉన్నాయి. మూతపడ్డ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులను అందుబాటులో పిల్లలు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేసి విద్యాబోధన అందిస్తున్నారు.

ఇంగ్లిష్ మీడియం ప్రారంభం

ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ సాధారణంగా మారింది. ఈనేపథ్యంలో దాదాపు అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఇంగ్లమాధ్యమంలోనే బోధన చేస్తున్నాయి. ఈక్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైతం ఇంగ్లిష్ బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తుంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎంఈఓలు లేకపోవడంతో పర్యవేక్షణ కరువైంది.

ఒక్కరికే నాలుగు మండలాలు..

మండల విద్యాశాఖ అధికారిగా మండలానికి ఒకరు ఉండాలి. కానీ, ఏ ఒక్క మండలానికి నేటికీ పూర్తి స్థాయి మండల విద్యాధికారి లేకపోవడం గమనార్హం. జిల్లాలో 13 మండలాలు ఉండగా సీనియర్ హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలను అప్పగించారు. వారికికూడా అదనంగా ఒకరికి నాలుగేసి మండలాలు అప్పగించారు. వారు రెగ్యులర్ హెచ్‌ఎం బాధ్యతలు నిర్వర్తిస్తూనే అదనంగా ఎంఈఓ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సైతం సెక్టోరియల్ అధికారుల పరిస్థితి అంతే. సెక్టోరియల్ అధికారులను అదనపు బాధ్యతల నిమిత్తం 2 వత్సరాల కాలానికి సీనియర్ హెచ్‌ఎంలను నియమించారు. వారి కాలపరిమితి కూడా పూర్తయింది. ప్రభుత్వం సర్కారు బడి వ్యవస్థలో మౌలిక వసతులతో పాటు, ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్లు, ఇతర సిబ్బందిని పోస్టులను భర్తీచేస్తే ప్రభుత్వం ఆశించిన విధంగా సర్కారు బడికి పూర్వవైభవం వచ్చే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది విద్యాశాఖపై దృష్టిసారించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పరిధిలో ఉంది



జిల్లాలో రెగ్యులర్ ఎంఈఓలు లేరు. రాష్ట్ర ప్రభుత్వం నియమించాల్సి ఉంది. ఉన్న సీనియర్ స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు అప్పగించాం. సెక్టోరియల్ ఆఫీసర్స్ పరిస్థితి కూడా అంతే. ప్రభుత్వం రెగ్యులర్ పోస్టులు మంజూరు చేయాలి.

- వాసంతి, డీఈఓ

అగ్రిమెంట్ చేయరు.. అద్దెలు అడగరు!

- పేరుకుపోయిన మడిగెల బకాయిలు
- సుమారు రూ.కోటి వరకు ఆదాయం కోల్పోతున్న మార్కెట్ కమిటీ
- పట్టించుకోని అధికారులు



ఖాళీగా ఉన్న కవర్ షెడ్

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్ పాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కవర్‌షెడ్‌లో నిర్మించిన 158 ప్లాట్లను 2022 ఫిబ్రవరిలో రిటైల్ వ్యాపారుల కోసం కేటాయించారు. అద్దెల ఖరారుపై నెలకొన్న సందిగ్ధంతో నేటి వరకు అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి కాలేదు. దీనివల్ల మార్కెట్ కమిటీ ప్రతి నెలా రూ.3,63,400 ఆదాయం కోల్పోయింది. అయినప్పటికీ.. అప్పటి మార్కెట్ కమిటీ పాలకవర్గం, మార్కెటింగ్ అధికారుల పట్టింపులేనితనంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోడల్ మార్కెట్‌లో కమీషన్ లైసెన్స్‌దారులకు మడిగెలు (షట్టర్లు), చిల్లర వ్యాపారులకు కవర్ షెడ్‌లో 158ప్లాట్లు, మార్కెట్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో మినీ హోల్‌సేల్, చిల్లర వ్యాపారులకు మరో 230ప్లాట్లను అధికారులు కేటాయించారు. ఇవి కాకుండా అనధికారికంగా మరో 200 మంది మార్కెట్ లోపల, బయట వ్యాపారాలు చేస్తున్నారు. కమీషన్ వ్యాపారులకు అద్దెలు నిర్ధారించిన అధికారులు ఖాళీ స్థలంలోని చిల్లర వ్యాపారుల విషయంలో ఆలస్యం చేయడంపై 'సాక్షి'లో వచ్చిన కథనాలకు స్పందించారు. ఓపెన్ ప్లాట్ల అద్దెలు నిర్ణయించడంతో వ్యాపారులు చెల్లింపులు చేస్తున్నారు. కవర్‌షెడ్‌లోని ప్లాట్ల అద్దెలపై స్పష్టత లేకపోవడం, వ్యా పారులు తగ్గించాలని,అధికారులు తగ్గేదేలే.. అని భీష్మించుకోవడంతో మార్కెట్‌కమిటీ లక్షల రూపాయ ల ఆదాయం కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

అద్దెల్లో తకరారు..

మార్కెట్‌లోని మడిగెలకు అద్దెలు ఖరారు చేసిన అధికారులు కవర్‌షెడ్‌లోని 158ప్లాట్లకు ఒక్కో దానికి నెలకు రూ.2,300 అద్దె నిర్ణయించి అగ్రిమెంట్లు చేసుకోవాలని ఆదేశించారు. కాగా.. మార్కెట్‌లో ఓపెన్ ప్లాట్లు కేటాయించడంతో కవర్‌షెడ్‌లోకి కూరగాయలు కొనేందుకు ఎవరూ రావట్లేదని అందువల్ల అధికారులు నిర్ణయించిన అద్దెలు కట్టలేమని వ్యాపారులంతా అధికారులు, అప్పటి ఎమ్మెల్యేకు తగ్గించాలని మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ ఈవిషయంపై మార్కెట్ అధికారులు దృష్టి సారించలేదు. దీంతో గడిచిన 27నెలలకు రూ.98,11,800 అద్దెలు పెండింగ్‌లో పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు కవర్ షెడ్ ప్లాట్లపై దృష్టి సారించి, అద్దెలు తగ్గిస్తే మార్కెట్‌కు అధిక ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి.

నేతలు దృష్టి సారించాలి..

ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి వరంగల్ లక్ష్మీపురంలో మోడల్ కూరగాయల మార్కెట్ నిర్మించినప్పటికీ ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది. నిర్వహణలోపం, వ్యాపారుల ఇష్టారాజ్యంతో లోపలకు వెళ్లేందుకు దారి సైతం వదలడం లేదు. మార్కెట్లో రోజుకు రూ.లక్షల వ్యాపారం జరుగుతున్నా.. మార్కెట్ కమిటీకి ఆదాయం లేకుండా పోయింది.

నకిలీ విత్తనాలు అమ్ముతున్నారని ఎమ్మెల్యేకు ఫోన్

- చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యే నాగరాజు
- పరిశీలించిన అధికారులు



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

రాయపర్తి(వర్ధన్నపేట): నకిలీ విత్తనాలు విక్రయించారంటూ వర్ధన్నపేట మండలంలోని బండౌతాపురం గ్రామస్తుడు జక్కుల రాములు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ఆదివారం ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. అధికారులకు ఫోన్‌ద్వారా తెలపడంతో గ్రామానికి చేరుకున్న వ్యవసాయాధికారులు పంటపొలాలను పరిశీలించడంతోపాటు ఫర్టిలైజర్‌షాపును తనిఖీ చేశారు. గత కొన్ని రోజులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు డయల్ యువర్ ఎమ్మెల్యే ప్రోగ్రాంను నిర్వహిస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఏడీఏ సురేష్‌కుమార్, ఏఓ సాగరిక, ఏఈఓ కావ్య తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ సస్పెన్షన్

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ మడికొండ సెక్షన్‌లో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాజు సస్పెన్షన్‌కు గురయ్యాడు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అతడిని సస్పెండ్ చేస్తూ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాజుపై అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టిన అధికారులు ఈనెల 15న మెమో జారీ చేశారు. వ్యవసాయ కనెక్షన్ ఇప్పించేందుకు రూ.65వేలు తీసుకున్నట్లు ఓ రైతు నుంచి అధికారులకు ఫిర్యాదు అందింది. అలాగే ఓ రైల్వే ఉద్యోగికి మూడు విద్యుత్ మీటర్లు ఇప్పిస్తానని చెప్పి రూ.30వేలు తీసుకున్నాడని తెలిపారు. ఓ ఇంటి విద్యుత్ బిల్లు రూ.10వేలు బకాయి ఉండగా.. రూ.6వేలు చెల్లించడానికి ఇవ్వగా కాజేసినట్లు ఫిర్యాదులు అందాయి.

క్లుప్తంగా

హేమాచలుడికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకున్న వేణుగోపాల్

మంగపేట : మండలంలోని మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహాస్వామిని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, పబ్లిక్ రిలేషన్స్ హార్క వేణుగోపాల్ ఆదివారం దర్శించుకున్నారు. తన మిత్రులతో కలిసి ఆలయానికి వచ్చిన వేణుగోపాల్‌కు ఆలయ పూజారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా ఆహ్వానం పలికారు. అనంతరం ఆలయంలోని స్వయంభు స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఏటూరు నాగారం ఏఎస్పీ మహేష్ బాబాసాహెబ్, ములుగు డీఎస్పీ, ఎస్సై గోదరి రవికుమార్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



చిల్పూరు: అక్రమంగా లారీలో మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న రూ. 4,42,000 లక్షల విలువైన 17 టన్నుల రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు, టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన మోటం జంపయ్య, మోటం రాజశేఖర్.. లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కిలోకు రూ. 7 నుంచి 10 చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. వీటిని రాజవరం గ్రామ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో నిల్వ చేస్తున్నారు. వీటిని మహారాష్ట్రలోని పలు హోటళ్లలో కిలోకు రూ. 25 నుంచి 30 వరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో లబ్ధిదారుల నుంచి సేకరించిన 17 టన్నులు రేషన్ బియ్యం శనివారం రాత్రి లారీలో తరలించేందకు సిద్ధం చేస్తున్నారు. స్థానిక పోలీసులకు సమాచారం రావడంతో టాస్క్ ఫోర్స్ అధికారులతో కలిసి దాడి చేసి లారీతో పాటు బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సైబర్ నేరగాళ్ల బెదిరింపులు..

- రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దంపతులకు అసభ్యకర మెసేజ్‌లు పంపుతున్న కేటుగాళ్లు

ఖిలా వరంగల్: సైబర్ నేరగాళ్లు ఫేక్ ఐడీ సృష్టించి రూ.30వేలు ఇవ్వాలంటూ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా దంపతులను బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ఘటన శంభునిపేటలో వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం.. వరంగల్ శంభునిపేట ప్రాంతానికి చెందిన ఓ దంపతుల ఫోన్ నంబర్లను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అసభ్యకర మెసేజ్‌లు పంపిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. రూ.30 వేలు ఇస్తే అసభ్యకర మెసేజ్‌లు పంపించడం నిలిపివేస్తామని పేర్కొంటున్నారు. దీనిపై బాధితులు స్పందించపోవడంతో ఆ దంపతుల ఫోన్‌లకు అసభ్యకర మెసేజ్‌లు పంపిస్తున్నారు. దీంతో సైబర్ నేరగాళ్ల వేధింపులు భరించలేక ఆదివారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.





బ్యాగు.. భద్రత ముఖ్యం



వరంగల్ బట్టల బజారు రోడ్డులోని ఓ షాపులో స్కూల్ బ్యాగులు

స్కూల్ బ్యాగు.. పుస్తకం నుంచి మొదలు.. పెన్ను, పెన్సిల్, టిఫిన్ బాక్స్, కర్చీఫ్, వాటర్ బాటిల్ తదితర వస్తువుల వరకు భద్రపరిచే బ్యాంక్. ఒకరకంగా చెప్పాలంటే పిల్లల ప్రపంచం.. వారి ఆస్తి. అందుకే రోజంతా తమ భుజాలపై ఉండే బ్యాగు ఎంత భద్రంగా, మన్నికగా ఉంటే విద్యార్థులు అంత సౌకర్యంగా ఉంటారు. లేనిపక్షంలో అసహనానికి గురవుతారు. అందుకే తల్లిదండ్రులు నాణ్యమైన బ్యాగులు కొనుగోలు చేయాలి.

మన్నిక లేకుంటే మూణ్నాళ్ల ముచ్చటే!
- పునః ప్రారంభమైన పాఠశాలలు
- షాపుల్లో కొనుగోలుదారుల సందడి
- అందుబాటులో బ్రాండెడ్ బ్యాగులు
- మంచి స్కూల్ బ్యాగ్‌ను ఎంచుకోండిలా



బ్యాగులు కొనుగోలు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఖిలా వరంగల్ : వేసవి సెలవులు ముగిశాయి. ఈ నెల 12వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. దీంతో ఆటాపాటలు, అల్లరికి ఫుల్‌స్టాప్ పెట్టిన పిల్లలు బడిబాట పడుతున్నారు. ఇక నుంచి పుస్తకాలతో కుస్తీ.. అక్షరాలతో దోస్తీ కట్టనున్నారు. ఈ క్రమంలో ఫీజులు.. పుస్తకాలు.. బ్యాగులు.. యూనిఫాం.. ఇలా ఎన్నో సమకూర్చాల్సి ఉంటుంది. ఇందుకు పెద్ద మొత్తంలోనే వెచ్చించాల్సి ఉంటుంది. అయితే ఫీజులు , పుస్తకాలు ఎంత ముఖ్యమో స్కూల్ బ్యాగు కూడా అంతే ముఖ్యం. ఎందుకుంటే కనీసం ఏడాదిపాటు బ్యాగు అవసరం ఉంటుంది. సుమారు 5 కేజీల నుంచి 10 కేజీల బరువున్న పుస్తకాలను బ్యాగులో సర్ది పిల్లలు దీనికి భుజానికి ఎత్తుకుంటారు. మధ్యలో తెగినా, చిరిగినా, జిప్పు ఊడినా, కుట్లు ఊసినా పిల్లలకు ఇబ్బందే.. సాధారణంగా చాలా మంది పిల్లలు ఇంటికి చాలా దూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్తుంటారు. ఆటోలు, స్కూల్ బస్సుల్లో ప్రయాణిస్తారు. ఉదయం ఏడు గంటలకే ఇంటి వద్ద బయలుదేరితే సాయంత్రానికి ఇంటికి చేరుకుంటారు. రోజంతా పుస్తకాలు, బ్యాగుతో కుస్తీపట్టే విద్యార్థులు ఏ మాత్రం అసౌకర్యం అనిపించినా అసహనానికి గురవుతారు. అందుకే నాణ్యమైన బ్యాగులు కొనుగోలు చేయాలి. అప్పుడే విద్యార్థికి పాఠశాల రాకపోకల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో ఏ బ్యాగులు లభిస్తున్నాయి..? వాటి రకాలు, నాణ్యత, తదితర అంశాలపై కథనం..

భద్రత, మన్నిక ముఖ్యం

స్కూల్ బ్యాగుకు భద్రత, మన్నిక ముఖ్యం. వర్షం పడినా పుస్తకాలు తడిసే పరిస్థితి లేని భద్రత ఉండాలి. అలాగే, బ్యాగు ఎక్కువ రోజులు ఉపయోగపడితేనే నాణ్యత ఉన్నట్లు. స్వల్ప వర్షానికి పుస్తకాలు తడవకుండా అన్ని కంపెనీలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. కానీ భారీ వర్షం పడితే మాత్రం ఎలాంటి బ్యాగులోని పుస్తకాలైనా తడిసిపోవడం ఖాయం. అందుకే కొన్ని బ్రాండెడ్ కంపెనీలు ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. జిప్‌తో ప్రత్యేక ప్యాకెట్‌లా ఉండే ప్రాంతం ఇది. అవసరమయ్యే సమయంలో కవర్ తీసుకోవచ్చు. లేని సమయంలో దాచుకోవచ్చు. చాలా బ్యాగులకు వాటర్ ప్రూఫ్ సదపాయంతోపాటు వారంటీ కూడా ఇస్తున్నారు. వాటిలో ముఖ్యమైనవి 22 లీటర్ల (వ్యాల్యూమ్)సైజ్ నుంచి 45 లీటర్ల (వ్యాల్యూమ్)సైజు వరకు బ్యాగుల అందుబాటులో ఉన్నాయి. లీటర్ (వ్యాల్యూమ్)పెరిగిన కొద్ది ధర రూ.100 నుంచి రూ.500 వరకు పెరుగుతుంది. ఇలాంటి బ్రాండెడ్ బ్యాగుల ఖరీదు రూ. 600 నుంచి రూ.2వేల ధరలో లభిస్తున్నాయి. నాణ్యతను బట్టి ఏడాది నుంచి ఐదేళ్ల వరకు వారంటీ ఉంటుంది. వారంటీ కాలంలో పాడైన బ్యాగు జిప్, క్లిప్‌లను ఉచితంగా బాగు చేసి ఇస్తారు. కుట్లు ఊడిపోతే కొత్త స్టిచ్చింగ్ చేస్తారు. ఏకారణంగానైనా బ్యాగు చిరిగిపోతే అయ్యే వ్యయాన్ని మాత్రం వసూలు చేస్తారు.

బ్యాగుల కొనుగోళ్ల సందడి..

పాఠశాలలు పునః ప్రారంభంకావడంతో వరంగల్ ట్రైసిటీలో ఎక్కడ చూసినా బ్యాగుల కొనుగోళ్ల సందడి మొదలైంది. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల బ్యాగులూ మార్కెట్లోకి వచ్చేశాయి. అందమైన కార్టూన్లతో విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. బ్రాండెడ్ కంపెనీల బ్యాగులు లభ్యమవుతున్నాయి. వరంగల్ బట్టల బజార్, స్టేషన్ రోడ్డు, పిన్నవారి స్ట్రీట్, హనుమకొండ చౌరస్తా , పోర్ట్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో బ్రాండెడ్ కంపెనీల బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. పిల్లల ఆకర్షించే కొత్త తరహా బ్యాగులపై తయారీదారులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.

కంపెనీ బ్యాగులు కొనుగోలు చేశా..



స్కూల్ బ్యాగుల ధర గతేడాది కన్నా ఎక్కువ ఉన్నా.. నాణ్యత చూసి కొనుగోలు చేస్తున్నాం. ఫెంటాఫ్, జీనియస్, అమెరికన్ కంపెనీల బ్యాగులు మార్కెట్లో ఉన్నాయి. బ్యాగు ఆకర్షణీయంగా ఉన్నాయా లేదా అనే అంశాలను చూస్తున్నాం. అన్ని రకాల మోడల్స్ అందుబాటులో ఉన్నాయి. కంపెనీ బ్యాగును కొనుగోలు చేశా.

-కె. నవీన్‌రెడ్డి, శంభునిపేట వరంగల్

అందుబాటులో కంపెనీ బ్యాగులు



రూ.600 నుంచి రూ.2500 లోపు కంపెనీ బ్యాగులు అందుబాటులో ఉంచాం. తల్లిదండ్రులు బ్యాగుల కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు. ధర ఎక్కువ ఉన్నా నాణ్యత చూసి స్కూల్ బ్యాగులు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది కన్నా ఈసారి అమ్మకాలు ఎక్కువ ఉన్నాయి. లాభాలు తక్కువ ఉన్నా.. కొనుగోళ్లు ఎక్కువ జరుగుతున్నాయి. సంతృప్తికరంగా ఉంది.

-ఎండీ దస్తగిరి షాపు యజమాని, వరంగల్

పిల్లలను ఆకర్షించడం ముఖ్యం..

స్కూల్ బ్యాగు.. పిల్లలు ప్రపంచం. మన్నిక, భద్రత ముఖ్యమే అయినా పిల్లలను ఆకట్టుకునేలా ఉండడం కూడా చాలా అవసరం. ఈ కారణంగానే తయారీదారులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంటారు. పిల్లలను ఆకర్షించేలా పలు రకాల బొమ్మల మోడల్స్, ఇతరత్రా ఆకర్షించే మోడళ్లను ఆందుబాటులో ఉంచారు. ఇవి రూ.250 నుంచి రూ.600 మధ్య ధర పలికే సాధారణ రకం బ్యాగులు. ఈ బ్యాగులోనే టిఫిన్, పెన్సిల్, పెన్నుల బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు పెట్టుకునేందుకు వీలుగా ప్రత్యే ఆరలు అందుబాటులో ఉంచుతున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు వాడే బ్యాగుల్లో లాప్‌టాప్ పెట్టుకునే సదుపాయం కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

ఆడపిల్లలు పుట్టడమే పాపమా?

భార్యాపిల్లలను గెంటేసి ఇంటికి తాళం వేసిన ప్రబుద్ధుడు
- ఆపై తల్లిదండ్రులతో కలిసి పరార్
- వరంగల్ కరీమాబాద్‌లో ఘటన
- మిల్స్‌కాలనీ పీఎస్‌లో బాధితురాలి ఫిర్యాదు



కరీమాబాద్‌లో అత్తారింటి ఎదుట ధర్నా చేస్తున్న నవిత, తన కూతుళ్లు

ఖిలా వరంగల్ : 'ఆడపిల్లలు లేనిదే సృష్టి లేదు. ఆడపిల్లలను బతకనిద్దాం.. సమాజంలో గౌరవంగా నిలుపుదాం.. ఆడపిల్లను చదవనిద్దాం.. ఎదగనిద్దాం.. ఇంటికి వెలుగులు.. ఆడపిల్ల చిరునవ్వులు.. అంటూ ప్రభుత్వాలు, అధికారులు ఎన్ని అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసినా కొందరు మారడం లేదు. ఆడపిల్లల పట్ల ఇంకా వివక్షే ప్రదర్శిస్తున్నారు. బాలికకు జన్మించిందంటే చాలు.. ఎక్కడో చోట ఆ తల్లిని చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఇలాంటి ఘటన వరంగల్‌లో చోటు చేసుకుంది. ఆడపిల్లలకు జన్మనివ్వడమే ఆ ఇల్లాలు చేసిన పాపం..! ఆడపిల్లలకు జన్మనిచ్చిందని ఓ ప్రబుద్ధుడు.. తన భార్య, ఇద్దరు పిల్లలను ఇంటి నుంచి గెంటేసి తాళం వేసి పరారు కాగా.. స్థానికులు, బంధువుల సహకారంతో ఆ ఇల్లాలు తన ఇద్దరి పిల్లలతో కలిసి అత్తారింటి ఎదుట ధర్నా చేపట్టింది. ఈ ఘటన ఆదివారం వరంగల్ ఉర్సు కరీమాబాద్ సుభాశ్‌నగర్‌లో వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నాయుడు పెట్రోల్ బంక్ సమీప కాలనీకి చెందిన భైరి వీరస్వామి, నాగమణి దంపతుల కుమార్తె నవితను 14 ఏళ్ల క్రితం వరంగల్ ఉర్సు కరీమాబాద్ సుభాష్‌నగర్‌కు చెందిన బలభద్ర నారాయణ, చంద్రకళ దంపతుల కుమారుడు రాజేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ సమయంలో కట్నం ఇతర కానుకలు అందజేశారు. అయితే ఇద్దరు ఆడపిల్లలకు జన్మనిచ్చావంటూ భర్త, అత్తామామ వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో నవిత ఈ విషయం తన తల్లిదండ్రులకు చెప్పి కన్నీరుమున్నీరుగా విలపించింది. దీంతో వీరస్వామి తనకు మార్తె ఎదురవుతున్న కష్టాలు చూడలేక 43వ డివిజన్ నక్కలపల్లిలో ఓ ఇళ్లు, మహారాష్ట్రలోని బీమండిలో ఒక ఇళ్లు బిడ్డకు ఇచ్చేశారు. అయినా ఆడపిల్లలకు జన్మనిచ్చావని మళ్లీ భర్త.. నవితను కొట్టిగా.. ఆరునెలల క్రితం ఒక కన్ను కోల్పోయింది. చికిత్స పొందిన తర్వాత ఆదివారం ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని అత్తారింటికి చేరింది. ఇంట్లోకి అడుగుపెట్టగానే భార్య, ఇద్దరు కుమార్తెలను ఇంటి నుంచి గెంటేసి తాళం వేసి భర్త తల్లిదండ్రులను వెంట తీసుకుని పరారయ్యాడు. దీంతో నవిత పుట్టింటికి వెళ్లకుండా స్థానికులు , బంధువుల సహకారంతో అత్తారింటి ఎదుట ధర్నా నిర్వహించింది. స్థానికులు.. తాళం ధ్వంసం చేసి భార్య, ఇద్దరు కుమార్తెలు ఇంట్లోకి పంపించారు. రాత్రి సమయంలో భర్త వచ్చి ఏదైనా బెదిరింపులకు పాల్పడితే 100 డైల్ చేసి పోలీసులకు సమాచారం చెప్పాలని భరోసా కల్పించారు. కాగా, ఆడపిల్లలకు జన్మనివ్వడమే నవిత చేసిన పాపమా..? పోలీస్ అధికారులు వెంటనే స్పందించి చిత్రహింసలకు గురిచేస్తున్న భర్తకు బుద్ధి చెప్పాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

తల్లికి క్యాన్సర్.. పట్టించుకోని కొడుకులు

- చికిత్సకు రూ. లక్షల్లో ఖర్చు అవుతున్న కానరాని పుత్రులు
- కొడుకులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- న్యాయం చేయాలని వృద్ధ తల్లిదండ్రుల వేడుకోలు



మాట్లాడుతున్న శంకరయ్య, విజయ దంపతులు

వేలేరు : నవమాసాలు మోసి.. మరణం అంచుల వరకు వెళ్లి జన్మనిచ్చి.. ఆపై కంటికి రెప్పలా కాపాడి పెంచి పెద్ద చేసిన ఆ మాతృమూర్తి.. తన పేగులకు (కొడుకులు) బరువైంది. అనారోగ్యంతో బాధపడుతుంటే కళ్లప్పగించి చూస్తున్నారే తప్ప కనికరించడం లేదు. చికిత్స చేయించి తల్లిని కాపాడుకోవాల్సిన ఆ ప్రబుద్ధులు పట్టించుకోవడం లేదు. పైగా భూమి అమ్ముకుని ఆరోగ్యం బాగు చేసుకుందామని భావించిన ఆ తల్లి ఆలోచనకు అడ్డు తగులుతూ ఇక్కడ కూడా కిరికిరి చేస్తున్నారు. ససేమిరా అంటున్నారు. దీంతో విసిగి వేసారిన ఆ తల్లి న్యాయం చేయాలని కోరుతూ పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కింది. అయితే ఇక్కడా పట్టించుకోకపోవడంతో ఆదివారం వేలేరు మండల కేంద్రంలో విలేకరులకు తన గోడు వెల్లబోసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన దొనికెల శంకరయ్య, విజయ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కొడుకులు ఉన్నారు. అందరికీ పెళ్లిలు అయ్యాయి. కాగా, శంకరయ్యకు 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇద్దరు కొడుకులకు చెరో 4 ఎకరాల భూమిని పంచి ఇచ్చారు. తమ పేరుపై 2 ఎకరాలు ఉంచుకున్నారు. ఈ క్రమంలో కొన్ని నెలల కిత్రం శంకరయ్య భార్య విజయ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరగా పరీక్షలు చేసిన అనంతరం క్యాన్సర్ వచ్చిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో శంకరయ్య తన భార్య విజయకు రూ.15 లక్షలు అప్పు చేసి చికిత్స చేయించాడు. ఇంకా వైద్య ఖర్చులకు డబ్బు అవసరం ఉంది. అయితే చికిత్స కోసం చేసిన అప్పు తీర్చేందుకు శంకరయ్య తన పేరుపై ఉన్న రెండు ఎకరాల భూమిని అమ్ముదామంటే కొడుకులు అడ్డుపడుతున్నారు. భూమిని అమ్మకుండా తమను ఇష్టానుసారంగా దూషిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అప్పు తీర్చమంటే తమ కొడుకులు తీర్చడం లేదని, భూమి అమ్మనివ్వడం లేదని కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై ఇప్పటికైనా పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

దైవదర్శనానికి వచ్చి.. నదిలో మునక

- కాళేశ్వరంలోని గోదావరిలో యువకుడి గల్లంతు



అఖిల్

కాళేశ్వరం: తల్లి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనానికి వచ్చిన ఓ యువకుడు.. పుణ్యస్నానం ఆచరిస్తున్న క్రమంలో గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన గరికపాటి ప్రవీణ్-రజినీ దంపతుల కుమారుడు అఖిల్ (19) తల్లి, మేనత్త స్నేహ, చెల్లి రక్షిత, మరదలు స్ఫూర్తితో కలిసి ఆదివారం కాళేశ్వరం వచ్చారు. ఈ క్రమంలో దర్శనానికి ముందు త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేయాలని గోదావరి వద్దకు వెళ్లారు. అయితే అక్కడ కాకుండా కాస్త దూరంలో స్నానం చేయడానికి గల్లంతైన యువకుడు అందరినీ తీసుకెళ్లాడు. అందరూ స్నానం చేసి బయటకు రాగా, అఖిల్ మాత్రం నీటిలోకి జారిపోయాడు. ఒక్కసారి నీటిలో మునిగి ఎవరికీ కనిపించలేదు. దీంతో భయాందోళనకు గురైన తల్లి, ఇతర కుటుంబీకులు కేకలు వేస్తు దగ్గరిలోని జాలర్లకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కాళేశ్వరం ఎస్సై భవానీసేన్, సిబ్బంది వచ్చి జాలర్లను తీసుకువచ్చి నదిలో దిగి యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటికావడంతో పాటు గాలి వీస్తుండడంతో గాలింపు చర్యలు నిలిపి వేశారు. ఈ ఘటనతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సోమవారం ఉదయం గాలింపు చర్యలు చేపట్టనున్నారని ఎస్సై తెలిపారు.

22న జేఎల్ఎం అభ్యర్థులకు పోల్ టెస్ట్

హన్మకొండ : 2018వ సంవత్సరంలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో మిగిలిపోయిన జూనియల్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులకు పోల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. ఈ నెల 22న(శనివారం) ఉదయం 9 గంటలకు హనుమకొండ పెద్దమ్మగడ్డలోని విద్యుత్ శిక్షణ కేంద్రంలో పోల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటనలో వివరించారు. ఉమ్మడి వరంగల్‌లోని అర్హులైన అభ్యర్థులకు ఇప్పటికే పోల్ టెస్ట్‌కు హాజరు కావాలని లెటర్లు పంపినట్లు తెలిపారు. అదే విధంగా సర్కిల్ కార్యాలయాల నోటీసు బోర్డులపై అర్హుల జాబితా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక పరీక్ష పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందన్నారు. అభ్యర్థులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.

వరుణుడి కరుణ కోసం..



కొత్తగూడ: కప్పతల్లి ఆడుతున్న చిన్నారులు



చెన్నారావుపేట: పత్తినాయక్ తండాలో

- పలుచోట్ల కప్ప తల్లి ఆడిన చిన్నారులు

కొత్తగూడ: ఈసారి ముందస్తు వర్షాలు కురిశాయి. రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయనే వార్తలు వచ్చాయి. దీంతో అన్నదాతలు దుక్కులు చేసుకుని పత్తి గింజలు విత్తారు. నార్లు పోసుకున్నారు. అయితే మొదట మురిపించిన వరుణుడు ఒక్కసారిగా ముఖం చాటేశాడు. కొద్ది రోజులుగా చినుకు కురువడం లేదు. ఫలితంగా వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో వర్షాలు కురవాలని వేడుకుంటూ ఆదివారం మండలంలోని కొత్తపల్లిలో చిన్నారులు కప్పతల్లి ఆడారు. కప్పలను కర్రకు కట్టి నడుముకు వేప మండలు కట్టుకు ని 'కప్ప తల్లి కప్ప తల్లి కడివెడే నీళ్లు' అంటూ గ్రామంలో తిరుగుతుండగా గ్రామస్తులు బిందెలతో నీల్లు పోసి స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లి వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామ దేవతలకు మొక్కుకున్నారు.

పత్తినాయక్ తండాలో..

చెన్నారావుపేట: వర్షాలు కురవాలని ఆదివారం మండలంలోని పత్తినాయక్ తండాలో చిన్నారులు కప్పతల్లి ఆడారు. ఇంటింటికీ తిరిగారు. ఈ సందర్భంగా మహిళలు నీళ్లు ఆరబోస్తూ మొక్కులు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిపించాలని వరుణ దేవుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో చిన్నారులు రాహుల్, బానోతు బన్ని, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు

వరుణయాగం..



కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని రామాలయంలో ఆదివారం వరుణ యాగం నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించి విస్తారంగా వర్షాలు కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండి రైతుల కష్టాలు తొలగాలని వేడుకున్నారు. యాగంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– రేగొండ(కొత్తపల్లిగోరి)

ఇసుక లారీ ఢీకొని వ్యక్తి మృతి



మధునయ్య మృతదేహం

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని గ్రావిటీ కాల్వ వద్ద ఇసుక లోడుతో వెళ్తున్న లారీ.. బైక్ పైన వస్తున్న వ్యక్తిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మెట్‌పల్లి పంచాయతీ పరిధిలోని బీరాసాగర్ గ్రామానికి చెందిన జైన మధునయ్య(50) ఆదివారం కాటారం మండలంలోని గుండ్రాత్‌పల్లి సమీపంలో గల ఊట్లపల్లి పోచమ్మ అమ్మ వారికి మొక్కులు చెల్లించి ద్విచక్ర వాహనం తిరిగి వస్తున్నాడు. కాళేశ్వరం సమీపంలోని గ్రావిటీ కాల్వ వద్దకు రాగానే కాళేశ్వరం నుంచి హైదరాబాద్‌కు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మధునయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఎస్సై భవానిసేన్, తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరకొని మృతదేహాన్ని పరిశీలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు.

ఈతకు వెళ్లి వృద్ధుడు..

ఖిలా వరంగల్ : చెరువులో ఈతకు వెళ్లి ఓ వృద్ధుడు నీటమునిగి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఖిలా వరంగల్ మండలం దూపకుంటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. దూపకుంట గ్రామానికి చెందిన ఆకుల ప్రవీణ్(60) ఈత కొట్టడానికి ఇదే గ్రామ చెరువులోకి వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో కందకంలో నీట మునిగి మృతి చెందాడు. ఈతకు వెళ్లిన ప్రవీణ్ ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికారు. సమాచారం అందుకున్న వరంగల్ ఫైర్ అధికారి శ్రీనివాస్‌రావు, లీడింగ్ ఫైర్ అధికారి మాధవ రెడ్డి, సిబ్బంది ప్రసాద్, గిరి,రవితోపాటు గీసుగొండ పోలీసులు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా ఆదేరోజు సాయంత్రం 4 గంటలకు మృతదేహం లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు..



దేవేందర్ (ఫైల్)

రాయపర్తి(వర్ధన్నపేట): విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం వర్ధన్నపేట మండలం రాంధాన్ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం .. తండాకు చెందిన గుగులోత్ దేవేందర్(35) కు అదే తండాకు చెందిన వరుసకు సోదరుడైన మంజ తన ఇంట్లోకి కరెంట్ సరఫరా కావడం లేదని తెలిపాడు. దీంతో దేవేందర్ తండాలో గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి విద్యుత్ స్తంభం ఎక్కాడు. సరిచేస్తున్న క్రమంలో పైన ఉన్న 11 కేవీ మెయిన్ వైర్ తగిలి పైనుంచి కింది పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉంది. దేవేందర్ మృతితో కుటుంబంతోపాటు తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.